క్లుప్తంగా

బీడీ కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(సెంట్రల్): బీడీ కార్మికుల ఇళ్ల సమస్యను సీఎం వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ బాధితులకు హామీ ఇచ్చారు. బుధవారం సీపీఎం నగర కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో కొందరు బీడీ కార్మికులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీడీ కార్మికుల కాలనీకి సంబంధించి ఎక్కువగా కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉండడంతో ఇబ్బందిగా ఉందన్నారు. పరిహారం చెల్లించాల్సిన ఇళ్లకు సంబంధించి త్వరగా ఇచ్చేలా రెవెన్యూ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. త్వరలోనే బాధితులు ఇళ్లు నిర్మించుకు నేలాచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఘనంగా సీఎస్ఐ అవరోహణ ప్రతిష్ట



చర్చి ఉపాధ్యక్షుల కుటుంబాన్ని సత్కరిస్తున్న చర్చి సభ్యులు

కర్నూలు (టౌన్): నగరంలోని రెవెన్యూ కాలనీలో ఉన్న సీఎస్ఐ అవరోహణ చర్చి ప్రతిష్ట బుధవారం ఘనంగా నిర్వహించారు. డయాసిస్ ఉపాధ్యక్షులు డాక్టర్ పీఏ వరప్రసాద్ మాట్లాడుతూ 17 ఏళ్లుగా చర్చిలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ అభివృద్ధికి పాటుపడినట్లు చెప్పారు. బైబిల్ వాక్యానుసారం ప్రతిఒక్కరూ నడవడికను అలవర్చుకోవాలన్నారు. అప్పుడే సమాజంలో శాంతి ఉంటుందన్నారు. అనంతరం చర్చి ఉపాధ్యక్షుల కుటుంబాన్ని సత్కరించారు. కార్యక్రమంలో పాస్టర్లు భాస్కర్‌రావు, డేవిడ్ వినయ్, చర్చి కార్యదర్శి అగస్టీన్, కోశాధికారి దేవకృప, చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పుట్టుకతో లోపాలు ఉంటే డైస్‌కు పంపండి



బాలుడిని పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ హేమలత

కర్నూలు(హాస్పిటల్): పుట్టుకతో లోపాలున్న పిల్లలను గుర్తించి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డైస్ కేంద్రానికి పంపి చికిత్స చేయించాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా కోఆర్డినేటర్ హేమలత సామాజిక ఆరోగ్య అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలకు సూచించారు. నగర శివారులోని ప్రజానగర్ కాలనీలో పుట్టుకతోలోపాలున్న బాలుడి కుటుంబాన్ని కలిసి బాలుడి తల్లితో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లల్లో వచ్చే పుట్టుక లోపాలు, పోషకాహార లోపాలు, సరిగా మాట్లాడలేకపోవడం,మానసిక అభివృద్ధిలో వచ్చే లోపాలున్న పిల్లలకు డైస్ కేంద్రంలో వైద్యపరీక్షలతో పాటు పౌష్టికాహారం అందిస్తారన్నారు.

మహిళా ఐక్యవేదికను బలోపేతం చేద్దాం

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్య వేదికను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి కోరా రు. బుధవారంబీ క్యాంప్‌లోని వేదిక కార్యాలయంలో ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ రెండు జిల్లాల్లోని అన్ని మండలాల్లో వేదిక కమిటీ నిర్మాణాలను చేపట్టాల్సి ఉందన్నారు. మహిళలు ఆత్మ గౌరవం, హక్కుల కోసం నిరంతరం పోరాడాలన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, దాడులకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో మహిళా నాయకురాళ్లు భారతమ్మ, ఏలీషమ్మ, అకుతోట పద్మావతి, సరోజ, హుసేన్‌బీ, ప్రభావతి, దస్తగిరమ్మ, ఖాసీంబీ, వరలక్ష్మి పాల్గొన్నారు.

పాణ్యంలో చోరీ

పాణ్యం: పాణ్యంలోని షాదీఖానా వద్ద ఉన్న ఓ ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్ఐ అశోక్ బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన మంగమ్మబాయి ఉదయం ఇంటికి తాళం వేసి పనికి వెళ్లింది. సాయంత్రం వచ్చి చూడగా ఇంటి గొళ్లెం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.50వేలు, 10తులాల వెండి వస్తువులు దొంగిలించినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాణ్యం: సుగాలిమెట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. బుధవారం రాత్రి నంద్యాలకు చెందిన గోవిందురాజు కోడుమూరు నుంచి బైక్‌పై వస్తూ సుగాలిమెట్ట వద్ద అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. అతన్ని హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు.

ఇంటి వద్దకే ఆర్టీసీ కార్గో సేవలు

- కొరియర్, పార్సిల్స్ డోర్ డెలివరీపై ప్రత్యేక దృష్టి
- గత ఏడాది 2021 సెప్టెంబర్ 1 నుంచే అమల్లోకి
- ఏజెన్సీ మారడంతో కొంత కాలం బ్రేక్
- విస్తృత ప్రచారం కోసం నేటి నుంచి మాసోత్సవాలు

సరుకు రవాణాలో అడుగు పెట్టిన రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులు, వ్యాపారుల సరుకులు, పార్సిళ్ల సరఫరాపై దృష్టి పెట్టింది. కొరియర్స్‌ను ప్రజల ఇంటి వద్దకే చేర్చేందుకు ప్రత్యేక దృష్టి పెట్టంది. రెండేళ్ల క్రితం ప్రవేశపెట్టిన డోర్ డెలివరీ సేవలను మరింత విస్తృతం చేస్తోంది. గతంలో ఒక పట్టణం నుంచి మరో పట్టణంలోని ఆర్టీసీ పార్సిల్ కేంద్రాలకు మాత్రమే సేవలు ఉండగా వినియెగదారులు తమకు వీలున్నప్పుడు బస్‌స్టేషన్‌లకు వెళ్లి పార్సిల్‌ను తెచ్చుకునేవారు. ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో 2021 సెప్టెంబరు 1వ తేదీ నుంచి డోర్ డెలివరీ సేవలు అందుబాటులోకి తెచ్చింది. బుకింగ్ సమయంలో డోర్ డెలివరీ అని ఆప్షన్ ఇస్తే సిబ్బంది సంబంధిత అడ్రస్‌కే కొరియర్‌ను అందిస్తున్నారు.



పార్సిల్ కార్యాలయం

కర్నూలు(రాజ్‌విహార్): కేవలం ప్రజా రవాణాకే ప్రాధాన్యత ఇచ్చిన ఆర్టీసీ 2016 కంటే ముందు లగేజీ, పార్సిల్స్‌ను ఏఎన్ఎల్ సంస్థ అనుబంధంగా సేవలందించింది. 2016 జూన్ 3 నుంచి స్వయంగా కార్గో సేవలను ప్రారంభించి, ఏఎన్ఎల్‌తో ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. పూర్తి స్థాయి సేవలపై దృష్టి పెట్టి,క్రమంగా డోర్ డెలివరీ విధానం తెచ్చి, ప్రైవేటు కొరియర్ సర్వీసులకు ధీటుగా సేవలందించేందుకు శ్రీకారం చుట్టింది. ఏజెన్సీ మారడంతో కొంత కాలం బ్రేక్ పడినా తిరిగి ఇటీవలే ప్రారంభించింది.

ఏడు పట్టణాల్లో సేవలు

డోర్ డెలివరీ సేవలను ప్రారంభించిన ఆర్టీసీ తొలుత రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లా కేంద్రాలతో పాటు రాజమండ్రి, తిరుపతి, విజయవాడ నగరాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. డోర్ డెలివరీ కోసం అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా డెలివరీ బాయ్స్‌ను నియమించుకున్నారు. ప్రస్తుతం కర్నూలుతో పాటు ఆదోని, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, డోన్, నంద్యాల, ఎమ్మిగనూరు పట్టణాల్లో సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల నూతన లేజెన్సీకి బాధ్యతలు అప్పగించడంతో డెలివరీ బాయ్స్ సంఖ్యను పెంచుకొని సేవలను వ్యాపింపజేయాలనే ఆలోచనలో ఉంది.

50 కేజీల్లోపు.. 10కిలో మీటర్ల లోపు

ఇంటి వద్దకే కొరియర్ సేవలందిస్తున్న ఆర్టీసీ ముందుగా 10 కేజీల్లోపు ఉన్న ఆర్టికల్స్‌కు మాత్రమే అందించారు. కొత్త బస్టాండ్ నుంచి 10 కిలో మీటర్ల లోపు కవర్లు, పార్సిళ్లు, బాక్సులు, సంచులు (బస్తా), పాకెట్లను బుకింగ్ చేసే సమయంలో 'డోర్ డెలివరీ' అని ప్రస్తావిస్తే ఇల్లు, కార్యాలయం, షాపులు, వ్యాపార సంస్థల వద్దకే వెళ్లి అందించారు. డెలివరీ సమయంలో యజమాని సెల్ నంబర్, సంతకం, ఫొటో తీసుకుని అప్పగిస్తూ వస్తున్నారు. గత ఏడాది నుంచి పార్సిల్స్ బరువు 10 కేజీల నుంచి 50కి పెంచి సేవలందిస్తున్నారు.

నేటి నుంచి మాసోత్సవాలు

ప్రస్తుతం పార్సిల్ కేంద్రాల నుంచి కర్నూలు జిల్లాలో (రీజియన్) రోజుకు 1,500 వరకు వరకు బుకింగ్స్ ఉండడంతో రూ.1.30 లక్షల వరకు ఆదాయం వస్తోంది. సొంత బస్సుల్లో సరుకు రవాణా చేస్తున్నందున్న రవాణా ఖర్చు లేదు. నెలకు సుమారు రూ.40 లక్షల ఆదాయం వస్తోంది. డోర్ డెలివరీ ద్వారా నెలకు రూ.1.50 లక్షల వరకు వస్తుందని అంచనా. ఇటు బాయ్స్‌ను తీసుకుంటే యువతకు ఉపాధి అవకాశాలూ వరించనున్నాయి. దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు గురువారం నుంచి నవంబరు 25వ వరకు డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రయాణికులు, వ్యాపారులు, వాణిజ్య సంస్థల ప్రతినిధులను సంప్రదించి తమ సేవలను వివరించనుంది.

చార్జీలు ఇలా..

డోర్ డెలివరీ కోసం అదనంగా చార్జీలు వసూలు చేయనున్నారు. ఒక కేజీలోపు బరువు ఉంటే రూ.18, ఆరు కేజీలలోపు ఉంటే రూ.30, పది కేజీల లోపు ఉంటే రూ.36, ఇరవై ఐదు కేజీల వరకు రూ.48, యాభై కేజీల వరకు రూ.59 చొప్పున వసూలు చేస్తున్నారు.

ప్రైవేటు కంటే మెరుగ్గా సేవలు



కొరియర్, పార్సిల్స్ రంగంలో ప్రైవేటు సంస్థల కంటే మెరుగ్గా డోర్ డెలివరీ సేవలందించేందుకు చర్యలు చేపట్టాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 50 కేజీల లోపు బరువు పార్సిల్స్‌ను ఆయా అడ్రస్‌కు తీసుకెళ్లి ఇస్తున్నాం. ఆ తరువాత క్రమంగా పట్టణాలకు విస్తరింపజేస్తాం.

– కేవీ రమణ, డీసీటీఎం, కర్నూలు

ఆరోగ్య సురక్ష శిబిరం తనిఖీ



చిన్నారికి టీకా వేస్తున్న డాక్టర్ వై ప్రవీణ్‌కుమార్

కర్నూలు సిటీ: మండల పరిధిలోని గొందిపర్ల గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వై ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. శిబిరంలో స్థానికులకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నారులకు టీకాలు వేసి, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మా వాటాతో కలిపి ఇండెంట్ పెట్టండి

- అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం

కర్నూలు (సిటీ): తుంగభద్ర జలాశయంలో తెలంగాణకు చెందిన ఆర్‌డీఎస్ కోటాగా 1.5 టీఎంసీ ఉందని, దీంతో పాటు ఏపీ వాటాగా ఉన్న నీటికి ఇండెంట్ పెట్టాలని తెలంగాణకు చెందిన అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం బుధవారం జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డిని కోరారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కోటాగా టీబీ డ్యామ్‌లో ఉన్న నీటిని ఒకేసారి ఇండెంట్ పెడితే ఇరు రాష్ట్రాల రైతులకు ఉపయోగపడుతుందన్నారు. స్పందించిన ఎస్ఈ.. ఏపీ వాటా నీటిని విడుదల చేయాలని ఇండెంట్ పెట్టే పరిధి తమ చేతుల్లో లేదని, రాష్ట్రస్థాయి అధికారులే ఇండెంట్ పెట్టాల్సి ఉందని వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్

కర్నూలు (సిటీ): సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్ అధికారులకు సూచించారు. బుధవారం స్టాంటన్ పురంలోని క్యాంపు కార్యాలయంలో కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల అధికారులతో సమీక్షించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలపై చర్చించారు. ఇప్పటి వరకు గుర్తించిన సమస్యలతో ఎన్ని పరిష్కారమయ్యాయని, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని ఎంపీడీఓలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు.

ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరణ

కల్లూరులోని రావూరి గార్డెన్‌లో నవంబర్ 3, 4, 5 తేదీల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రాన్స్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే స్వగృహంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్, జిల్లా మత్స్య శాఖ జేడీ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

సాగు నీరు ఇచ్చి ఆదుకోండి



ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డితో చర్చలు జరుపుతున్న రైతు సంఘం నాయకులు, రైతులు

కర్నూలు సిటీ: పంటలకు సాగు నీరు ఇచ్చి ఆదుకోవాలని పలువురు రైతులు కోరారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పడిదెంపాడు గ్రామానికి చెందిన రైతులు బుధవారం జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కేసీ కెనాల్ పరిధిలో సాగు చేసి పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయని, కనీసం ఒక్క తడి నీరిచ్చినా పైర్లను కాపాడుకుంటామని విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డికి రైతు సంఘం నాయకులకు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం చాంబర్‌లో ఎస్ఈ రైతులతో సమావేశమై నీటి లభ్యతపై చర్చించారు. మల్యాల పంపింగ్ గురించి ఎస్ఈ డీఈఈ రఘురామిరెడ్డిని ఆరి తీయగా పూడూరు వరకు వస్తున్నాయని, పడిదెంపాడు గ్రామస్తులకు రెండు, మూడు తూములకు నీరు అండడం లేదని వివరణ ఇచ్చారు. అల్లూరు, పడిదెంపాడు దగ్గరలోని పంపులకు మరమ్మతులు చేయించి అవసరమైన మేరకు నీటిని అందించాలని ఎస్‌సీ.. డీఈఈకి సూచించారు. నిరసనలో ఏపీ రైతు సంఘం కార్యదర్శి రామకృష్ణ, మండల కార్యదర్శి మృత్యుంజయ, రైతులు శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

30న ప్రజా రక్షణ భేరీ బస్సు యాత్ర



పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో అక్టోబర్ 30 నుంచి చేపట్టే ప్రజా రక్షణ భేరీ బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ కోరారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 30న ఆదోనిలో ప్రారంభమయ్యే ప్రజా రక్షణ భేరీ బస్సుయాత్ర సాయంత్రానికి కర్నూలు చేరుకుని, పాతబస్టాండ్‌లోని అంబేడ్కుద్కర్ సర్కిల్‌లో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కేవీనారాయణ, పి.నిర్మల పాల్గొన్నారు.

- ఈనెల 30న ఆదోనిలో ప్రారంభించే ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను విజయంతం చేయాలని ఆ పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు మారెళ్ల విజయ్ కోరారు. బుధవారం జొహరాపురంలో ఇంటింటా తిరిగి యాత్రపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు రంగస్వామి, నాగరాజు, రమణ, తిప్పన్న, నూర్‌వలి, హసన్ వలి, మౌలాలీ పాల్గొన్నారు.


వైద్య రంగానికి ప్రాధాన్యత



విలేజ్ క్లినిక్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, ఎంపీపీ వెంకటేశ్వరమ్మ తదితరులు

కర్నూలు సిటీ: వైద్యరంగానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని, మారుమూల గ్రామాల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ తెలిపారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని పూలతోట గ్రామంలో బుధవారం డా.వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌ను ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా రూ.20.80 లక్షలతో నిర్మించిన భవనంలోని డాక్టర్ ఛాంబర్, ఏఎన్ఎం, ఫార్మాసిస్టు గదులను పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విలేజ్ క్లినిక్‌లో దాదాపు అన్ని వైద్య సేవలు అందుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, గూడురు, సి.బెళగల్ జెడ్పీటీసీలు మౌలాలి, గిరిజోన్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వాసు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మహబూబ్ బాషా, ఉల్చాల సర్పంచ్ సాగర్, స్థానిక నాయకులు రాజశేఖర్ రెడ్డి, మద్దిలేటి, సూర్యచంద్రారెడ్డి, రాజశేఖర్, సుధాకర్, గౌస్, బీసీ మద్దిలేటి, తిమ్మప్ప, లక్ష్మణ్‌గౌడ్, మల్లెపూల రాజు, నారాయణరెడ్డి, ఎంపీడీఓ అజాంఖాన్, ఈఓఆర్‌డీ అనురాధ, డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు 159 క్యూసెక్కులు విడుదల



గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు బుధవారం డ్యామ్ అధికారులు పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో 0.581 టీఎంసీల నిల్వ ఉందని, ఇన్‌ఫ్లో నిలిచిపోయిందని వారు తెలిపారు.

గంగమ్మ ఒడికి దుర్గమ్మ

- కనుల పండువగా దుర్గా మాత విగ్రహాల శోభాయాత్ర
- ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా మహిళల కలశ యాత్ర
- తుంగా తీరంలో శోభాయమానంగా దుర్గామాత నిమజ్జనోత్సవం



అమ్మవారి నిమజ్జనానికి తరలివచ్చిన భక్తులు



దుర్గా మాతకు పూజలు నిర్వహిస్తున్న మేయర్ బీవై రామయ్య, చిత్రంలో మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

కర్నూలు(సెంట్రల్): దసరా శరన్నవరాత్రుల్లో పూజలు అందుకున్న దుర్గా మాత విగ్రహాల నిమజ్జనోత్సవ వేడుక శోభాయమానంగా జరిగింది. తుంగభద్రా నది ఒడ్డున ఉన్న సంకల్ బాగ్‌లో దుర్గమ్మలు గంగమ్మలో కలిసిపోయారు. బుధవారం దుర్గాఘాట్‌లో గీతా ప్రచార సమితి, దుర్గా మాత విగ్రహాల నిమజ్జనోత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగర మేయర్ బీవై రామయ్య, రాజ్యసభ మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి, కర్నూలు డీఎస్పీ విజయశంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి గంగమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం పరాశక్తి బృందం దుర్గా మాత విగ్రహానికి పూజలు నిర్వహించి నిమజ్జనాన్ని ప్రారంభించారు. అంతకు ముందు నగరంలోని వివిధ ప్రాంతాల్లో కొలువు దీరిన దుర్గా విగ్రహాల శోభాయాత్ర వైభవంగా సాగింది. మహిళలు అధిక సంఖ్యలో బోనాలతో ఊరేగింపులో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కోలాటాలు, భజనలతో నగరంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. టీజీవీ కళా క్షేత్రం ఆధ్వర్యంలో ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. తుంగభద్రా నదితో పాటు, కేసీ కెనాల్ వినాయ ఘాట్‌లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో టీజీ భరత్, బీవీ రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, చిన్మయ మిషన్ అమ్మవారు సుప్రేందనంద, కేజే రెడ్డి గీత ప్రచార సంఘం అధ్యక్షులు రమణయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్పొరేట్ కృష్ణకాంత్, దుర్గా ఉత్సవ సమితి ప్రతినిధులు ఎలమర్తి రమణయ్య, విఠలశెట్టి, మహాబలేష్, హనుమంతరావు, దాశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాయల్ కాపునాడు అధ్యక్షుడిగా సాంబశివరావు



కర్నూలు (టౌన్): జిల్లా రాయల్ కాపునాడు అధ్యక్షుడిగా 39వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ చెన్నుబోయిన సాంబశివరావు ఎన్నికయ్యారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ విభాగం కార్యనిర్వాహక సభ్యులు, రాయల్ కాపునాడు జాతీయ కార్యదర్శి తుపాకుల రాఘవేంద్ర, రాష్ట్ర అధ్యక్షులు గంగుల వీరాంజనేయులు ఆయనను నియమిస్తూ నియమాక పత్రాలు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సాంబశివరావు మాట్లాడుతూ కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల అభివృద్ధికి పాటుపడతానన్నారు.

అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న ఉమామహేశ్వరమ్మ

కల్లూరు: కల్లూరు అర్బన్ 19వ వార్డు గణేష్ నగర్‌లో ప్రతిష్టించి నవరాత్రులు పూజలందుకున్న దుర్గా మాతను బుధవారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ దర్శించుకుని, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వేధింపుల కేసు నమోదు

గోనెగండ్ల: మండల కేంద్రంలోని అచ్చుకట్ల వీధికి చెందిన బీబీ ఫాతిమా అనే వివాహితను భర్త, అత్త, మామ, మరిది అదనపు కట్నం తేవాలని వేధింపులకు గురిచేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. గోనెగండ్లలోని అచ్చుకట్ల వీధికి చెందిన బీబీ ఫాతిమాకు, అదే గ్రామానికి చెందిన షేక్ సలీం బాషకు ఆరేళ్ల క్రితం వివాహం అయ్యింది. అయితే గత రెండు సంవత్సరాలుగా భర్త సలీం బాష, అత్త షేక్ మెహరిన్ బీ, మామ రసూల్‌సాబ్, మరిది షేక్ షఫీ రూ.2 లక్షలు వరకట్నం తేవాలని మానసికంగా, శరీరకంగా వేధిస్తున్నారు. బాధితురాలు ఫాతిమా ఇచ్చిన ఫిర్యాదు మేరకుపై నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

దేవరగట్టు బన్ని ఉత్సవాల్లో విషాదం



మృతుడు మాల గణేష్ (ఫైల్)

ఆస్పరి: దేవరగట్టులో బన్ని ఉత్సవాలను చూసేందుకు వెళ్లిన యువకుడు శవమై ఇంటికి చేరడంతో తల్లిదండ్రులు, బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనతో ఆస్పరిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆస్పరికి చెందిన మాల వుశేని, సుజాతమ్మ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తె ఉన్నారు. కుమారుడు మాల గణేష్ (18) బేతంచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బైపీసీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులు రావడంతో గణేష్ స్వగ్రామానికి వచ్చాడు. మంగళవారం తోటి స్నేహితులతో కలసి దేవరగట్టులో జరిగే ఉత్సవాలను చూసేందుకు వెళ్లారు. అక్కడ చెట్టు కింద నిలబడిఉండగా ఒక్కసారిగా కొమ్మలు విరిగి గణేష్‌పై పడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. దైవకార్యాన్ని చూసేందుకు వెళ్లి ఒక్కగానొక్క కుమారుడు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. ఆలూరులో పోస్టుమార్టం తరువాత బుధవారం స్వగ్రామమైన ఆస్పరికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

ఆస్పరి/ఆలూరు రూరల్: దేవరగట్టులో చెట్టు విరిగి పడిన ఘటనలో మృతి చెందిన గణేష్ (18), రామాంజినేయులు (49) కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు భరోసా ఇచ్చారు. బుధవారం ఆస్పరిలో గణేష్, మొలగవల్లి కొట్టాలలో రామాంజినేయులు మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు,కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు కేశవరెడ్డి, రంగన్న, గఫూర్, వీరేష్, చిన్న ఈరన్న, శ్రీరాములు తదితరులు నివాళులర్పించారు.



పైపును పట్టుకుని పల్టీలు వేస్తున్న యువకులు

సాహసం అదుర్స్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో దసరా పండుగ పురస్కరించుకొని యువకులు రెండవ రోజు బుధవారం తాము నేర్చుకున్న విన్యాసాలు పద్రర్శించారు. సినిమాలను తలపించే రియల్ విన్యాసాలు చూసిన ప్రతి ఒక్కరికి ఒళ్లు గగుర్పొడిచే విధంగా సాహసం చేశారు. వీపునకు కొక్కీలు గుచ్చుకొని ట్రాక్టర్ లాగడం, వీపునకు కడ్డీలు గుచ్చుకొని గ్యాస్ సిలిండర్లను కట్టి పైకి లాగడం, కాళ్లకు కొక్కీలు కట్టుకొని వీపుకు చిన్న గ్యాస్ సిలిండర్ కట్టుకొని తలకిందులుగా నడవడం, ఇనుప పైపు చుట్టూ యువకులు పల్టీలు కొట్టడం, కర్రసాము, కుస్తీలు, పల్టీలు కొట్టడంతో పాటు రకరకాల విన్యాసాలు అబ్బురపరిచాయి.



వీపుపై గ్యాస్ సిలిండర్ కొక్కీలకు కట్టుకుని, కాళ్లకు కొక్కీలతో తలకిందులుగా విన్యాసం